క్లుప్తంగా

పట్టణ ఎస్సైగా అప్పారావు బాధ్యతల స్వీకరణ



నిడదవోలు: నిడదవోలు పట్టణ ఎస్సైగా పులప అప్పారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం టూ టౌన్ ఎస్సైగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. నిడదవోలు పట్టణ ఎస్సై పి.నాగరాజు పెరవలి మండలానికి బదిలీ అయ్యారు. నిడదవోలు పట్టణ ఎస్సై అప్పారావు గతంలో అనపర్తి, రాజమహేంద్రవరం, విజయవాడలలో పనిచేశారు. ఈ సందర్భంగా ఎస్సై అప్పారావు మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధుల నిర్వహణ, అసాంఘిక కార్యక్రమాలను పూర్తిగా నివారించేందుకు కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు పలకలు, బలపాల పంపిణీ

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఉర్దూ పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చేతుల మీదగా విద్యార్థులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, ఎండీ జైరుద్దీన్, ఎస్ఎం షరీఫ్, గంటుపల్లి శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు, గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడిపర్రులో గంగాలమ్మ జాతర



తాడిపర్రులో గంగాలమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న రజక సేవా సంఘ సభ్యులు

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామంలో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా గంగాలమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి గ్రామస్తులు పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఘనంగా ఊరేగించి గోగులమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో రజక సేవా సంఘం సభ్యులు కాకరపర్తి సూర్యచంద్రరావు, గోటేటి మల్లన్న, పాలూరి పోసియ్య, పాలెపు వెంకటేశులు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరులో 'తలారి' పరిచయ సభ

కొవ్వూరు: పట్టణంలోని యువరాజు ఫంక్షన్ హాల్లో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ నూతన అభ్యర్థి తలారి వెంకట్రావు పరిచయ సభ నిర్వహించ నున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్టీ గోపాలపురం నియోజకర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ)లు హాజర వుతారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ఈ సమావేశానికి హాజరు కావాలని రాజీవ్‌కృష్ణ కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

కొవ్వూరు: విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంఈఐ) బి.స్వర్ణ శ్రీనివాస్ నాయక్ అన్నారు. 35వ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ దినోత్సవం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదాలకు కారణాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనల గురించి ఆయన వివరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. థ్యాంక్యూ ఫర్ సేఫ్టీ డ్రైవింగ్ అంటూ డ్రైవర్‌కు పుష్పాలు అందజేశారు.అనంతరం డెల్టా ఆసుపత్రి వైద్యులు ఆర్టీసీ డ్రైవర్లకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. డిపో మేనేజర్ వైవీపీఎస్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొవ్వూరు: సీతంపేట జంక్షన్ సమీపంలో బుధవారం ఉదయం మోటార్ సైకిల్ అదుపు తప్పిన ఘటనలో నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన జగతి రాంబాబు (42) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. రాంబాబు భూమిని కౌలుకు తీసుకుని పూల తోటలు సాగు చేస్తుంటాడు. అతడు బుధవారం ఉదయం పూలను మార్కెట్‌కి తరలించి మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తుండగా సీతంపేట జంక్షన్ వద్ద కుక్క అడ్డు వచ్చింది. దానిని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న రాళ్లగుట్ట ఎక్కడంతో అతడి తలకు బలమైన గాయమైంది. అతడిని నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించినట్టు కొవ్వూరు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడు రాంబాబు భార్య మృతి సత్యశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు.

గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు
- పార్టీ కొవ్వూరు పట్టణ, మండల శ్రేణులతో పరిచయ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ తదితరులు

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులందరూ సమష్టిగా పని చేయాలని ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. వైఎస్సార్ సీపీ మండల, పట్టణ స్థాయి శ్రేణుల పరిచయ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. సమావేశంలో తలారి మాట్లాడుతూ రాష్ట్రంలో 175 స్థానాల్లోనూ విజయం సాధించాలన్న సంకల్పంతోనే అభ్యర్థుల మార్పులు, చేర్పులు చేశారన్నారు. అధిష్టానం నిర్ణయాన్ని అందరూ శిరసావహించాలని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకే తాను కొవ్వూరు అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు వెంకట్రావు ప్రకటించారు. తనను ఆశీర్వదించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుని రానున్న ఎన్నికల్లో సమన్వయంతో కలసి పనిచేద్దామన్నారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. తాను ప్రతి గ్రామానికీ వచ్చి అందర్ని కలుస్తానన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్ కృష్ణ మాట్లాడుతూ కొవ్వూరులో వెంకట్రావును నెగ్గించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. గ్రామాల వారీగా పార్టీ నాయకులతో వెంకట్రావు, రాజీవ్ కృష్ణ విడివిడిగా సమావేశమై, పరిచయం చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, వైస్ ఎంపీపీలు వీరమళ్ల నారాయుడు, నూతంగి రేఖ, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- 320 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



సమిశ్రగూడెంలో ట్యాబ్‌లు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, స్థానిక నాయకులు



నల్లజర్ల హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వచ్చారని, ప్రతి విద్యార్థికీ అత్యున్నత ప్రమాణాలతో కూడిన బోధన అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం తరఫున ఇచ్చే ఆస్తి విద్య మాత్రమేనని భావించిన సీఎం జగన్ నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దారన్నారు. ఆర్థిక సమస్యలతో పేద పిల్లలు చదువులకు దూరం కాకూడదనే సంకల్పంతో దేశంలో ఎక్కడా లేని విధంగా అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన వంటి పథకాలను ప్రవేశపెట్టి ప్రతి పేద విద్యార్థికి అండగా నిలిచారన్నారు. తిమ్మరాజుపాలెం, సింగవరం, విజ్జేశ్వరం, సమిశ్రగూడెం, పెండ్యాల, పురుషోత్తపల్లి, శెట్టిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి చదువుతున్న 320 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, సర్పంచులు దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, కారింకి అన్నవరం, తిక్కా శ్రీను, మొక్కరాల శ్రీను, సొసైటీ అధ్యక్షులు గజ్జరపు శ్రీరమేష్, యాళ్ల రామారావు, ఎంపీటీసీ సభ్యులు కర్రి సుజాత, బయ్యే కృష్ణబాబు, ఎంఈఓలు గణేష్, పి.గురుమూర్తి, హెచ్ఎం కె.జిలానీ పాల్గొన్నారు.

నల్లజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

నల్లజర్ల: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థులు 114 మందికి రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లు సమకూర్చింది. బుధవారం ఉదయం ఆ పాఠశాలలో హెచ్ఎం కోమలి చిత్ర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నల్లజర్ల సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్ చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని సీఎం జగనన్న కలలను విజయవంతం చేయాలన్నారు. ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ మొదటి, రెండో దశలలో మండలానికి 646 ట్యాబ్‌లు వచ్చినట్టు వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ని వెంకటలక్ష్మి, విద్య కమిటీ చైర్మన్ నీరుకొండ జయకృష్ణ, మండల విద్యాశాఖాధికారి–2 భగవతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో 407 మందికి వైద్యం



నిడదవోలు వైద్య శిబిరంతో సేవలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేదలకు కూడా మెరుగైన వైద్యం ఉచితంగా అందుతోందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. స్థానిక బాలాజీనగర్ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలను మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. అవసరమైన వారికి ఉచితంగా మందుల కిట్లను పంపిణీ చేశారు. నెహ్రూనగర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఈ.తేజశ్రీ నేతృత్వంలో వైద్యులు వేణుగోపాలరావు, మాధవిలు 407 మంది రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. శిబిరంలో 39 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి ఈ.తేజశ్రీ చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాసరావు, ఆకుల ముకుందరావు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

33 మంది క్షయ రోగులకు పోషకాహారం



కొవ్వూరులో టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొవ్వూరు: ప్రధాన మంత్రి క్షయ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా పట్టణంలోని 33 మంది టీబీ రోగులకు బుధవారం పోషకాహార కిట్లు అందజేశారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద వైద్యాధికారి సుష్మ చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. అలాగే స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 367 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.సంధ్య వైద్య శిబిరాన్ని పరిశీలించారు. పలువురు వైద్యులు రోగులకు సేవలు అందించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లను సిఫార్సు చేశారు.

ఏపీపీకి తలారి పరామర్శ



పెద్దేవం గ్రామంలో గన్నెమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న తలారి వెంకటరావు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఏపీపీ (అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్) కవల నాగేశ్వరరావు తల్లి గన్నెమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్యే తలారి వెంకటరావు బుధవారం పెద్దేవం గ్రామంలోని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గన్నెమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ, అందుగుల రవి, వల్లభశెట్టి చిన్ని, నల్లమిల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కుటుంబానికి..

కొవ్వూరు: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కొవ్వూరు మండల మాజీ అధ్యక్షుడు గురుజు బాల మురళీకృష్ణ (చిన్నారి) కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ బుధవారం పరామర్శించారు. మద్దూరులోని చిన్నారి స్వగృహానికి వెళ్లి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. చిన్నారి చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు తోట నారాయణ, ఉప్పులూరి సూరిబాబు, సంగీతం చిన వెంకటేశ్వర్లు, పార్టీ మండల మాజీ కన్వీనర్ ముళ్లపూడి కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

తాళ్లపూడి: పెద్దేవం గ్రామంలోని సుగంధి చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. తాళ్లపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిక్కాల గణేష్ (40) ఈనెల 20వ తేదీ ఉదయం టిఫిన్ కోసం బయటకు వచ్చాడు. తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే బుధవారం చెరువులో గణేష్ మృతదేహం తేలింది. దీంతో అతడు ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందినట్టు భావిస్తున్నారు. గణేష్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

నూరు శాతం సంక్షేమం, అభివృద్ధి మా లక్ష్యం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- చివటంలో రెండో రోజూ గడప గడపకూ..



చివటంలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: ప్రజలకు నూరు శాతం సంక్షేమం, అభివృద్ధి జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలో చివటం గ్రామంలోని ఎస్సీ ఏరియా, జగనన్న కాలనీ–1లో సొసైటీ అధ్యక్షుడు కొఠారు సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండో రోజు బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తన కుమారుడు వరుణ్ సాయితో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకం అయ్యారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలో ప్రజలు ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వ పాలనలో కూడా ప్రజాప్రతినిధులు ఇలా ప్రతి ఇంటి వద్దకూ వచ్చి సంక్షేమ పథకాలు అందాయా? మీ అవసరాలు ఏమిటి అని అడిగిన దాఖలాలు లేవన్నారు. ఈరోజు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి గుమ్మం వద్దకూ వచ్చి అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధిని ధైర్యంగా చెబుతోందన్నారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా! చేయూత అందిందా? ఆరోగ్యశ్రీ వర్తిస్తోందా? అమ్మ ఒడి చదువు అందిస్తోందా అంటూ శ్రీనివాస్‌నాయుడు ఆరా తీశారు. చంద్రబాబునాయుడికి ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ సారి కూడా టీడీపీ వారు అబద్ధపు హామీలు, అమలు చేయలేని మాటలు చెబితే నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, రాపాక శ్రీను, కేతా వెంకటేశ్వర్లు, రాజమండ్రి శివ, పడమటి నాగయ్య, గుర్రం రామకృష్ణ, టి.శ్రీను, అరిగెల రాధాకృష్ణ, అక్కిన వెంకటేశ్వరరావు, మన్నె త్రిమూర్తులు, బి.సూరిబాబు పాల్గొన్నారు.

యర్నగూడెంలో మంత్రి వనిత క్యాంపు ఆఫీసు

నేడు ప్రారంభోత్సవం



తానేటి వనిత, రాష్ట్ర హోం మంత్రి

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత తన క్యాంపు కార్యాలయాన్ని యర్నగూడెంలోని తన పుట్టినింట వద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని గురువారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తున్నట్టు ఆమె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2009 ఎన్నికల్లో గోపాలపురం ఎమ్మెల్యేగా పని చేసినపుడు వనిత ఇక్కడే క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకుని పాలన సాగించారు. 2012లో టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన వనిత వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నారు. అనంతరం 2014 ఎన్నికల్లో కొవ్వూరు టికెట్ కేటాయించడంతో అక్కడకు వెళ్లారు. 2014 నుంచి ఇప్పటి వరకూ కొవ్వూరులో నివాసం, క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకుని ప్రజలకు పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ పాలన సాగిస్తున్నారు. మరో రెండు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు మంత్రి వనితకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంతో గురువారం నుంచి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలకు ఆమె శ్రీకారం చుట్టబోతున్నారు. దాదాపు పదేళ్ల అనంతరం మరలా స్వగ్రామం యర్నగూడెం వస్తున్నందున పార్టీ శ్రేణులు భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం బైక్ ర్యాలీగా ద్వారకాతిరుమలకు వెళ్ల వేంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం అక్కడి కాపు కల్యాణ మండపం సమీపంలోని లే అవుట్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజల పరిచయ కార్యక్రమంలో మంత్రి తానేటి వనిత పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు హాజరవుతున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి వనితతో నల్లజర్ల మండల నేతల భేటీ



మంత్రి తానేటి వనితతో నల్లజర్ల మండల నేతలు

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన హోం మంత్రి తానేటి వనితను బుధవారం తాడేపల్లిగూడెంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ నల్లజర్ల మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్లజర్ల నుంచి కార్లలో ర్యాలీగా వెళ్లి మంత్రి వనితను కలిశారు. తమ మండలంలో పర్యటించాలని ఈ సందర్భంగా వారంతా ఆమెను కోరారు. మండలంలోని వివిధ అంశాలపై మంత్రి వనిత తమతో చర్చించినట్టు వారు చెప్పారు. వనితను కలిసిన నాయకులలో కారుమంచి రమేష్, గగ్గర శ్రీనివాస్, బంక అప్పారావు, మద్దిపాటి ప్రసాద్, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, పెండ్యాల హరే రామకృష్ణ, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, రాయుడు విజయకుమార్, పాకలపాటి రాంబాబు తదితరులు ఉన్నారు.

గోపాలపురంలో మహిళా ఓటర్లే అధికం



దేవరపల్లిలో పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

- నియోజకవర్గంలో పురుషుల ఓట్లు 1,18,783 మంది
- మహిళల ఓట్లు 1,23,008 మంది
- మొత్తం ఓటర్లు 2,41,798

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కె.మాధవీలత సోమవారం విడుదల చేసిన ఓటర్ల తుదిజాబితా ప్రకారం ఈ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఓటర్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నియోజకవర్గంలో మొత్తం 2,41,798 మంది ఓటర్లు ఉండగా, వారిలో మహిళలు మహిళలు 1,23,008 మంది కాగా, పురుషులు 1,18,783 మంది. ఇతర ఓటర్లు ఏడుగురు ఉన్నారు. గతంతో పోలిస్తే 7,081 మంది ఓటర్లు పెరిగారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 4,225 మంది ఎక్కువగా ఉన్నారు. గతంలో నియోజకవర్గంలో 2,34,717 మంది ఓటర్లు ఉండగా, వారిలో మహిళలు 1,19,011 మంది, పురుషులు 1,15,699 మంది .కాగా, ఇతరులు ఏడుగురు ఉన్నారు. నియోజకవర్గంలో మండలాల వారీగా కొత్త జాబితాలో ఓటర్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గోపాలపురంలో మొత్తం ఓటర్లు 50912 మంది ఉండగా, వారిలో పురుషులు 25003, మహిళలు 20907 మంది. దేవరపల్లిలో మొత్తం ఓటర్లు 64760 మంది ఉండగా, వారిలో పురుషులు 31739, మహిళలు 33020 మంది ఉన్నారు. నల్లజర్లలో మొత్తం ఓటర్లు 68212 మంది ఉండగా, వారిలో పురుషులు 33390, మహిళలు 34824 మంది ఉన్నారు. ద్వారకాతిరుమల మండలంలో మొత్తం ఓటర్లు 57910 మంది ఉండగా, వారిలో పురుషులు 28651, మహిళలు 29257 మంది ఓటర్లు ఉన్నారు.

ఆరోగ్యం కోసమే 'ఆడుదాం ఆంధ్రా'

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పట్టణంలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



నిడదవోలులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



కొవ్వూరులో క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నిడదవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను బుధవారం పట్టణంలోని ప్రభుత్వం హైస్కూల్ మైదానంలో ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కొద్దిసేపు వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన 240 మంది క్రీడాకారులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ కచ్చితంగా శారీరక శ్రమ చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్రా ముఖ్య ఉద్దేశం కూడా ఇదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఎమ్మెల్యే కుమారుడు వరుణ్ సాయి, ఎంపీపీ భాగ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఉండ్రాజవరం జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, ఆడుదాం ఆంధ్రా ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం. యూన్సీరాణి, ఎంపీడీవో శామ్యూల్, ఎంఈవో గురుమూర్తి, కౌన్సిలర్లు ఎండీ షకీరాబేగం, కొత్తపల్లి సుప్రియ, అహ్మదున్నీసాబేగం, గోపిరెడ్డి శ్రీనివాస్, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు..

కొవ్వూరు: యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు వేదికలు అవుతాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు అన్నారు. ఆడుదాం ఆంధ్రా కొవ్వూరు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి పోటీలు నిర్వహించడం ద్వారా ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందన్నారు. క్రీడాకారులతో కలిసి ఎమ్మెల్యే వెంకట్రావు, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ్, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, చైర్ పర్సన్ బావన రత్నకుమారి కొద్దిసేపు కబడ్డీ ఆడారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, డీఎల్‌డీవో వి.శాంతమణి, శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కర రావు, ఎంపీడీవో కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.